# లోకులు పలు కాకులు...

రచన : శ్రీ ఆర్. వామనమూర్తి.

చెట్లమీద పిట్టలు కూస్తున్నాయి, కొన్ని పిట్టలు తమ పిల్లలకు కూయడం మప్పుతున్నాయి,

నీలాటి రేవు అప్పుడే కదిలింది. పనుల కాలంవల్ల, ఊరికి ఉన్న ఒకే ఒకనుయ్యి అవడం వల్ల ఒకరికంటె ఒకరు ముందుగా వచ్చి నీళ్ళను చేదుకు పోతున్నారు. అయినా రద్దీ తగ్గలేదు.

చీకటి తెర తొలగి వెలుగురేక విప్పారించి అప్పుడే నీళ్ళు తోడుతున్న సోములమ్మ నూతిలోకి వంగి చేద తీసుకు బోతున్నదల్లా 'అమ్మో మనిషి, మనిషి అంది చేద వదిలేసి' ఏదే! ఏదే! అంటూ మిగతా వాళ్ళంతా సోములమ్మ కేసి చూసారు.

ఓ గడియవరకు సోములమ్మకు మాటే రాలేదు. మిగతా వాళ్ళకు ఏమిటో అది బోధపడలేదు. కొంచెం తేరుకున్నాక ఏమిటే సోములూ? అంది కాస్త పెద్ద వయస్సులో ఉన్న రాములమ్మ నూ... నూ... నూతిలో అంది మాటపడ బడుతూ సోములమ్మ.

అందరూ ఓ సారి నూతిలోకి చూసారు. తెల్లని జాకెట్టు, ఎఱ్ఱ చీరతో ఉన్న ఓ శవం తేలిఉంది బాబోయి శవం, బాబోయి శవం అంటూ బిందెలు కుండలు పట్టుకొని ఎవరిదారిన వారు పారిపోయారంతా.

ఆ మరుక్షణంలో ఊరంతా పాకిపోయింది. నూతిలో శవం అంటే నూతిలో శవం అని, ఎవరి తాలూకు అంటే ఎవరితాలూకు అని అప్పుడే గుసగుసలు ప్రారంభ మయాయి. కొంతరు మగవాళ్ళు కూడా వచ్చి చూసి పోతున్నారు.

బొమ్మళంగా ఉండడం వల్ల ఎవరిదో శవం ఎవరూ సరిగా పోల్చిచెప్ప లేకపోతున్నారు. కొందరు మాత్రం సూర్యం మాష్టరుగారి మరదలు శారద అని నిర్ధారించి చెప్పారు.

ఏమిటీ శారదా? అంటూ కొంతమంది ఆశ్చర్యాన్ని ప్రకటించారు.

♦ ♦ ♦

పది సంవత్సరాల కాలం వెనక్కి దొర్లింది. సూర్యం మాష్టారంటే ఆ ఊర్లో పిల్లకి పెద్దకి కూడా దేవుడే. ఆయన మాట వేదవాక్కు.

అలాగే ఆయన కూడా వారికి తలలో నాలికలా ఉండేవారు. బడికి పోయేటప్పుడు, బడి నుంచి వచ్చేటప్పుడు, కనిపించిన వారినందర్ని పేరు పేరున యోగ క్షేమాలు అడిగేవారు. సాయంత్రం వేళ కూర్చొని మంచి చెడ్డ నలుగురికి చెపుతుండేవారు.

ఓ రోజు పేపరు వినిపించినట్లు, మరోరోజు ఏ రామాయణమో చెప్పినట్లు చేస్తుండేవారు. ఆయన ఆ ఊళ్ళో అడుగుపెట్టడం కూడా చిత్రంగానే జరిగింది కూడా!

♦ ♦ ♦

రామావధాన్లు గారికి నలుగురూ ఆడపిల్లలే. వంశోద్ధారకుడు లేనేలేడు సరికదా! ఇక పుడతారనే ఆశ కూడా లేదు. కారణం, ఆయన అనారోగ్య పరిస్థితే.

పెద్దపిల్లను రెండవ పిల్లను ఘనంగా పెళ్ళిచేసి ఓ రోజున 'హార్ట్ఎటా' క్‌తో ఈ లోకం వదలి వెళ్ళిపోయారు రామావధాన్లు గారు.

వంశోద్ధారకుడు లేకపోవడం వల్ల, పెద్దల్లుడైన సూర్యం మాష్టారే ఆయన కర్మకాండలన్నీ పూర్తి చేసారు. రామావధాన్లు గారి మీదవలె సూర్యం మాష్టారంటే ఆ గ్రామస్థులకు ఎంతో అభిమానం. మగదిక్కు లేని ఆ కుటుంబం ఛిన్నాభిన్నమై పోతుంది. యింకా యిద్దరు పిల్లలకు పెళ్ళి కావలసివుంది. ఈ తరుణంలో ఆ కుటుంబాన్ని ఆదుకోవలసిన వాళ్ళు ఎవరైనా ఉండాలి.

గ్రామస్తులంతా ఓ నిర్ధారణకు వచ్చారు. సూర్యం మాష్టరుగారి గుణగుణాలన్నీ బాగా తెలుసుండడం వల్ల ఆయనే ఈ కుటుంబాన్ని ఆదుకొని ఓ ఒడ్డుకు చేరుస్తారని అనుకొన్నారు. రామావధాన్లు గారి పదిరోజుల కర్మకాండ పూర్తవకుండానే వచ్చి వారి అభిప్రాయాన్ని సూర్యం మాష్టారితో చెప్పారు.

కొడుకువైన, అల్లుడవైనా యికనీవే బాబు అంటూ రామసుబ్బమ్మగారు కూడా వారి మాటకు వంతపలికారు. సూర్యం మాష్టారు ఆ పరిస్థితుల్లో మరేం అనలేక పోయారు.

మానం అంగీకార సూచకంకదా? సూర్యం మాష్టార్ని ఆ గ్రామానికి బదలీ చేయించుకున్నారు వాళ్ళు

ఆ రోజు నుంచి సూర్యం మాష్టారే ఆ యింటి మంచి చెడ్డలన్నీ చూసుకుపోతున్నారు. గూరాచారం అవడం వల్ల పెద్ద కూతురు, తోడల్లుడూ ఎప్పుడో సంవత్సరానికో, రెండు సంవత్సరాలకో వచ్చి వెళ్ళిపోతుండేవారు. సంపాదించే పెడుతున్నాడో, అప్పుచేసే పెడుతున్నాడో కూడా రెండోకంటి వాడిక్కి తెలియదు. అంతెందుకు? ఎవరికి ఏది అవసరమని అతనికి అనిపిస్తే ముందుగా ఆయనే అడిగోని యిచ్చేసేవాడు. ఎవరూ తనని వేలెత్తి చూపించుకోకుండా పోయేవాడు.

అత్తయ్యా? కాకినాడలో ఏదో సంబంధం ఉన్నట్టు తెలిసింది. మనకు మతికి సరిపోతుందేమో చూద్దామా అంటూ ఓరోజు భోజనాల వేళ కదిపారు సూర్యం మాష్టారు.

అలాగేబాబు, ఓసారి చూసిరా. నీకు నచ్చిందంటే పిల్లను చూడ్డానికి వాళ్ళను రమ్మనమను అంటూ మజ్జిగ పోస్తూ అన్నారు రామసుబ్బమ్మగారు.

ఓ మంచిరోజు చూసుకొని! అత్తయ్యా కాకినాడ వెళ్ళొస్తాను. ఆ పెళ్ళివారి మంచి చెడ్డలు చూసి, బాగుంటే కములని చూడ్డానికి రమ్మనమని చెప్తాను.

అలాగే బాబు. శుభం. క్షేమంగా వెళ్ళి లాభంగా తిరిగిరా?

♦ ♦ ♦

అత్తయ్యా, అత్తయ్యా ఏమిటండీ గుమ్మంలోకి అడుగు పెట్టకుండా అంది కంచిని తీసుకుంటూ శ్యామల. ఏమిటి బాబు పిలిచావా నన్ను? ఇప్పుడే లోపలికి అడుగు పెట్టిన రామ సుబ్బమ్మగారు అడిగారు.

నాకు సంబంధం నచ్చింది. పిల్లను చూడ్డానికి రమ్మనమని వాళ్ళను చెప్పాను. ఈ రోజే బాగుందట సాయంకాలానికి పెళ్ళివారు వస్తారు. చాలా మంచిది బాబు, లే భోంచేద్దువుగాని. అంది రామసుబ్బమ్మగారు.

* * *

పెండ్లి చూపులు అయిపోయాయి. పిల్ల నచ్చింది. త్వరగా ముహూర్తాలు పెట్టించెయ్యండి మాష్టారు అని పెళ్ళిళ్ళ పెద్ద చెప్పి వెళ్ళిపోయాడు.

తను, తరువాత అదే పెండ్లి పెద్దగా నిలబడ్డం. పెళ్ళి ఎలా చేస్తానోనని భయపడసాగారు సూర్యం మాష్టారు. ఫరవాలేదు మాష్టారు, అదే అయిపోతుందని అప్పుడప్పుడు నలుగురు ధైర్యం చెప్తూ ఉండేవారు.

పెండ్లి ఘనంగా జరిగిపోయింది. మనుగుడుపులు జరిగిపోయాయి. పిల్లకు కావలసిన సారె సామానంతా ఘనంగా పెట్టేశారు. అప్పటికే సూర్యం మాష్టార్కి ఇద్దరు పిల్లలు కమల కూడా వచ్చి పురుడు పోసుకు వెళ్ళింది. పండుగలని, పబ్బాలని ఒకటి తప్పితే ఒకటి జరిగిపోతూనే ఉన్నాయి.

నాలుగైదు సంవత్సరాలు కాలచక్రంలో దొర్లిపోయాయి. శారద పెళ్ళికూడా ఘనంగా జరిగిపోయింది. రామసుబ్బమ్మగారికి నెత్తిమీద నున్న బరువంతా తీసినట్లయింది.

మధ్యమధ్యను అతివృష్టి అనావృష్టివల్ల పొలాలు దెబ్బతిన్నాయి కూడా? ఏమైనా రెండోకంటి వాడికి తెలియకుండా సంసారం చూసుకుపోతున్నారు. ఎప్పుడూ ఓ వస్తువుకోసం ఒకరి ఇంటికి వెళ్ళడానికి యిష్టపడదు సూర్యం మాష్టారి మనసు.

వండి వార్చి పెట్టడం తప్ప యీ వస్తువుంది, అదిలేదని యింట్లో వాళ్ళకి అక్కరలేదు. అలా సాగిపోతోంది ఆ కుటుంబం.

శారద మొగుడు కూడా ఎదో బ్యాంకిలో సూపరు వైజరుగా చేస్తున్నాడు. నెలకు ఐదారువందలు జీతం కాక ముడుతూనే ఉంటుంది. కాయ పండూ వాటిని గురించి యిక చెప్పేఅక్కర లేదమ్మా? అంది ఓ సారి చెల్లెల్ని చూసొచ్చిన శ్యామల.

అందరూ శారద అదృష్టం గురించి మురిసిపోయారు. ఆ పండక్కి యీ పండక్కి శారద రాకపోకలవల్ల అత్తవారింటి సమాచారం కొంతకొంత సూర్యం మాష్టరుగార్కి, రామ సుబ్బమ్మగార్లకు తెలియవచ్చింది.

శారద అత్తగారు కట్టి జులాయి మనిషట. రూపాయిని పైసాలా ఖర్చు పెడుతుందట. యిక ఆడపిల్లలు సరేసరి ఎప్పుడు ఇంట్లో ఉంటారో, ఎప్పుడు ఇంట్లో ఉండరో కూడా తెలియదట అని.

శారద మొగుడు కూడా జులాయిమనిషేనట. ఈ మధ్య అతగాడుకూడా లేటుగా రాత్రిళ్ళు రావటం

తలుపు తియ్యగానే గుప్పున వాసన కొట్టడం కూడా జరిగేదట. శారద ముందుఏదో అనుకొంది. క్రమంగా అతను క్లబ్బుల్లో చేరాడు, త్రాగివస్తున్నాడని తెలిసింది. ఎప్పుడూ ఈ విషయం పుట్టింటివాళ్ళకు తెలియజెయ్యనే లేదు. ఓరోజు రాత్రి తప్పత్రాగి వచ్చి వెంటనే తలుపుతీయక లేటుగా తీసిందని నానామాటలూ అని, అక్కడున్న కుర్చీ కర్రతీసి గొడ్డును బాదినట్లు బాదాడట. ఆ దెబ్బలకు వాతంవచ్చేసి పడిపోయింది. అది చూసి ఇంటిల్లి పాదికంగా రెచ్చిపోయారు.

ఒకరు డాక్టరు దగ్గరకు పరుగెడితే, మరొకరు ఫోను దగ్గరకు పరుగెత్తారు, సూర్యం మాష్టారు, రామసుబ్బమ్మ గార్లకు ఆ టెలిగ్రాం చూసాక కాళ్ళాడక ఎప్పుడు శారదను కంటితో చూడగలమా, లేదా అంటూ రెక్కలు కట్టుకు వచ్చినట్లు వచ్చి చేరారు.

శారద పరిస్థితి అక్కడున్న నాలుగురోజుల్లోను వాళ్ళకు తెలిసింది. ఆ ఇంటి వాతావరణాన్ని అవగాహన చేసుకున్నారు. అత్తయ్య, శారదకు కొంచెం బాగుంది ఇక మనం వెళ్ళిపోదాం అన్నారు మాష్టారు. అలాగే బాబు అంది రామసుబ్బమ్మగారు. ఇంట్లో నలుగురితో చెప్పేసి ఇంటికి చేరుకున్నారు.

* * *

అమ్మా! రామసుబ్బమ్మగారు, శ్యామలమ్మ గారు అంటూ వీధిలో నుంచి ఎవరో పిలుస్తున్నారు. ఎవరు... ఎవరు అంటూ గదిలో నుంచి రామసుబ్బమ్మగారు, పెరట్లో నుంచి శ్యామలా ఒకేసారి వచ్చారు. ఆ జనాన్ని చూసి వారికి ఏం బోధపడలేదు.

అమ్మా మాష్టరుగారు బడినుంచి వస్తూ రక్తం వాంతి చేసుకొని పడిపోయారు. అంటూ మంచం మీద తీసుకు వచ్చిన మాష్టరు గార్ని లోపల పడుకో బెడుతూ అన్నాడు ఊరిపెద్ద నాయుడు.

ప్రెసిడెంటు కృష్ణమూర్తి డాక్టర్ని తీసుకొని చక్కా వచ్చాడు. అప్పటికే రెండు మూడుసార్లు వాంతి చేసుకున్నారు మాష్టారు. డాక్టరు పరీక్ష పూర్తయింది. ఏవో మందు, ఇంజక్షనలు ఇచ్చి వెళ్ళిపోయారు.

అలా ఇంజక్షనులు, మందులు వాడుతూనే ఉన్నారు, నాటిదారి నాటిది, రోగందారి రోగంది అయిపోతోంది, నాయుడు బాబు... అంటూ గుమ్మంలో అడుగు పెడుతున్న నాయుడు మరోనలుగురు పెద్దమనుష్యుల్ని చూసి గొల్లుమన్నారు రామసుబ్బమ్మ; శ్యామలాను.

అంతా విన్నామమ్మా! మేము డాక్టరు గారి దగ్గర నుంచే వస్తున్నాం. ఉక్కు మనిషిలాంటి సూర్యానికి ఆ కేన్సరేమిటో నాకేం బోధపడంలేదు. ఏళ్ళు మీరాయా అంటే అదీ లేదు? ఇనుముకు చదలు పట్టడం కాదూ అంది బొంగురు పోయిన కంఠంతో రామసుబ్బమ్మ గారు.

అమ్మా! రోగాలకు వయో భేదంకాని పేద సాదాని లేడా కాని లేవమ్మ ఎవరికేనా రావచ్చు అన్నాడు నాయుడు. పరవాలేదమ్మా ఈనాడు వైద్యరంగంలో చాలా ముందుకు పోతున్నాం. మీరేమి కంగారు పడకండి. అదే తగ్గిపోతుంది అంటూ వాళ్ళకు చెప్పి అక్కడ నుంచి నాయుడు వాళ్ళు వెళ్ళిపోయారు.

మరో నాలుగు రోజులకు పిడుగులాంటి వార్త ఓక్షణంలో ఊరంతా వ్యాపించింది, సూర్యం మాష్టారు పోయారంటే పోయారని.

(సశేషం)

★

సైన్స్ టీచర్ : ఏరా! కృష్ణా చెవివలన వుపయోగాలు చెప్పరా!

కృష్ణ : మనం కాల్చిన చుట్ట, బీడి, సిగరెట్ ముక్కలు పెట్టుకోవచ్చు, ఇంకా పైకలు కూడా ఎంచక్కా దాచెయొచ్చు. ఇంకా కళ్ళద్దాల్లు పడకుండా పెట్టొచ్చు సార్!

సై-మాష్టర్ : పోనీ! ముక్కువలన'

కృష్ణ : చీమిడి తీసుకోవచ్చు ఇంకా కళ్ళద్దాలు పెట్టుకోడానికి ఆధారంగా వుంటుంది సార్!

-ప్రవీణ్ సుశ్రీ, కొత్తగూడెం.